సాక్షి
నల్లగొండ
శనివారం । 28 । సెప్టెంబర్ । 2024



సబ్సిడీపై రుణాలు

పండ్లు, కూరగాయల తోటల సాగుకు సబ్సిడీపై రుణాలు ఇవ్వనున్నట్లు డీసీసీబీ ఛైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.
- 12లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటిమట్టం : 590 అడుగులు	
ప్రస్తుత నీటి మట్టం	: 588.90 అడుగులు
ఇన్‌ఫ్లో	: 46.630 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 46.630 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 28.623 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 10.120 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 5.087 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 2.400
వరద కాల్వకు	: 400

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 645 అడుగులు	
ప్రస్తుత నీటి మట్టం : 644 అడుగులు	
ఇన్‌ఫ్లో	: 3.830 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	: 4.877 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: 216.67 క్యూసెక్కులు
కుడికాల్వకు	: 48.15 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

పోషకాహార లోపాన్ని అరికట్టవచ్చు



ప్రదర్శనను తిలకిస్తున్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర

నల్లగొండ : ఆహారపు అలవాట్లలో మార్పుతోనే పోషకాహార లోపాన్ని అరికట్టవచ్చని అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర అన్నారు. శుక్రవారం జాతీయ పోషకాహార మాసోత్సవం సందర్భంగా సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో 'అందరికీ పోషకాహారం'పై నిర్వహిస్తున్న మూడు రోజుల సమగ్ర సమాచార, అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైవిధ్యభరితమైన పోషకాహార అంశాల సమాచారాన్ని ప్రజలకు చేరవేయడం ఒక సవాల్ అన్నారు. ఈ సవాళ్లను అధిగమించి పోషకాహారంపై సామాజిక మార్పు తేవడమే పోషణ్ అభియాన్ లక్ష్యమన్నారు. ఖనిజాలు, విటమిన్లు ఎక్కువగా ఉన్న సాంప్రదాయ ఆహారాన్ని తీసుకోవడం ద్వారా కౌమార బాలికలు, గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారణతో పాటు, మంచి ఆరోగ్యం లభిస్తుందన్నారు. అనంతరం తాజా ఆహార మార్గదర్శకాలు, స్థూల–సూక్ష్మ పోషకాల ప్రాధాన్యం, ఆహారంలో పోషక వివరాలను గుర్తించే విధానం తదితర అంశాలతో కూడిన ఫొటో ప్రదర్శన, గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. వంటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించి సాంస్కృతిక ప్రదర్శన అలరించింది. ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ అరుంధతి, జిల్లా సంక్షేమ అధికారి సక్కుబాయి పాల్గొన్నారు.

బీజేపీ చేనేత సెల్ నూతన కమిటీ

నల్లగొండ టూటౌన్ : బీజేపీ చేనేత సెల్ జిల్లా నూతన కమిటీని శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర నాయకులు ప్రకటించారు. జిల్లా కన్వీనర్‌గా గట్టుప్పల్‌కు చెందిన వర్కాల శ్రీనివాస్, కో కన్వీనర్‌గా కటకం శ్రీధర్‌తో పాటు మరో 15 మందిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



వివరాలు అడిగి తెలుసుకుంటున్న జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి

చందంపేట : వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఉందని జెడ్పీ సీఈఓ ప్రేమ్ కరణ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చందంపేట మండల కేంద్రంలో శ్మశానవాటిక, పల్లె ప్రకృతి వనం, మండల కేంద్ర పరిసరాలను ఆయన పరిశీలించారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొని పరిసరాలను పరిశుభ్రంగా ఉచుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి రామలింగారెడ్డి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక రంగంతో ఉపాధి

నల్లగొండ రూరల్: పర్యాటక రంగం ఉపాధితోపాటు ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతుందని రిటైర్డు ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మహాత్మాగాంధీ యూనివర్సిటీలో టూరిజం విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ పర్యాటక దినోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అధ్యాపకులు అంజిరెడ్డి, సరిత, రమేష్, లక్ష్మీప్రభ, శ్వేత, జ్యోతి, స్వప్న, కిరణ్మయి, శేఖర్ పాల్గొన్నారు.

● బాపూజీకి నివాళి



కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా నల్లగొండలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు

● యువజనోత్సవం



జిల్లా యువజన ఉత్సవాల సందర్భంగా నల్లగొండలోని కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి బాలుర జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో గిరిజన సంప్రదాయ నృత్యం చేస్తున్న యువతులు

ఉపాధి కోర్సుల్లో ఎస్సీ యువతకు శిక్షణ

నల్లగొండ రూరల్ : తెలంగాణ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఫర్ నర్సెస్ ఆధ్వర్యంలో ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో ఎస్సీ నిరుద్యోగులకు పలు మెడికల్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నట్లు సంస్థ ప్రాజెక్టు మేనేజర్ సైదులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత భోజన వసతి కల్పిస్తామని పేర్కొన్నారు. జనరల్ డ్యూటీ అసిస్టెంట్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, డయాలసిస్ టెక్నీషియన్, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుల్లో శిక్షణ ఇస్తామని తెలిపారు. పదో తరగతి పూర్తయిన వారు ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 9059902355, 9848581100 ఇతర నంబర్లను సంప్రదించాలని కోరారు.

సీఎంఆర్.. బేఖాతర్!

బియ్యం ఇవ్వడంలో మిల్లర్ల నిర్లక్ష్యం

- అధికారులు ఎన్ని సమీక్షలు చేసినా పూర్తికాని లక్ష్యం
- పక్క జిల్లాల్లో సీఎంఆర్ ఇవ్వని మిల్లులపై కేసులు
- ఈ నెలాఖరే గడువు.. ఆలోగా ఇవ్వకపోతే చర్యలకు సిద్ధం



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) డెలివరీ కొనసాగుతూనే ఉంది. మిల్లర్లు ప్రభుత్వం నుంచి ధాన్యం తీసుకుని వారిచ్చిన గడువు ప్రకారం తిరిగి బియ్యాన్ని ఎఫ్‌సీఐ, పౌర సరఫరాల శాఖలకు అప్పగించడంలో జాప్యం చేస్తూనే ఉన్నారు. గడువు మీద గడువు పొడిగించినప్పటికీ జిల్లాలోని మిల్లర్లు సీఎంఆర్ ఇవ్వడంలో మొండికేస్తున్నారు. గత వానాకాలం, యాసంగి సీజన్లలో కలిపి ఇంకా 97,558 మెట్రిక్‌టన్నుల బియ్యాన్ని ఇవ్వాల్సి ఉంది. పక్క జిల్లాలో సీఎంఆర్ ఇవ్వని మిల్లర్లపై కేసులు నమోదు చేస్తున్నా.. ఇక్కడి మిల్లర్లలో చలనం రావడం లేదు. దీంతో ఈ నెలాఖరులోగా బియ్యం ఇవ్వకపోతే చర్యలు చేపట్టేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

పలుమార్లు గడువు పొడిగింపు..

2023–24 వానకాలం, యాసంగికి సంబంధించి సీఎంఆర్ ప్రభుత్వం ఇచ్చిన గడువులోగా ఇవ్వాలని చెబుతున్నా మిల్లర్లకు పట్టడం లేదు. దీంతో ప్రభుత్వం పలుమార్లు గడువును పొడగించింది. గతేడాది వానాకాలం సీఎంఆర్‌కు సంబంధించి గడువును ఈ నెలాఖరు వరకు పొడగించింది. గడువు ముగిసేందుకు ఇంకా మూడు రోజులే ఉంది. ఈలోగా సీఎంఆర్ డెలివరీని పూర్తి చేస్తారా? లేదా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు గతేడాది యాసంగి ధాన్యానికి సంబంధించిన సీఎంఆర్ ఇచ్చేందుకు వచ్చే నెలాఖరు వరకు గడువు ఉండగా భారీ మొత్తంలో బియ్యం ఇవ్వాల్సి ఉంది.

35 మిల్లుల నుంచి వానాకాలం సీఎంఆర్

2023–24 సంవత్సరం వానాకాలం సీజన్‌లో జిల్లాలో మిల్లర్లకు 3,22,754 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పౌరసరఫరాల సంస్థ ఇచ్చింది. దానికి సంబంధించి 2,17,577 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సీఎంఆర్ కింద మిల్లర్లు ఎఫ్‌సీఐకి రారైస్, బాయిల్డు రైస్ కింద ఇవ్వాల్సి ఉంది. అయితే ఏడాది అవుతున్నా ఇప్పటి వరకు 1,98,843 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మాత్రమే మిల్లర్లు ఇచ్చారు. ఇంకా 35 మిల్లుల నుంచి 18,733 మెట్రిక్ టన్నుల బియ్యం రావాల్సి ఉంది.

52 మిల్లుల నుంచి యాసంగి సీఎంఆర్

యాసంగికి సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం జిల్లాలోని మిల్లర్లకు 3,26,021 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఇచ్చింది. అందుకు సంబంధించి 2,21,569 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సీఎంఆర్ కింద ఇవ్వాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు 1,42,746 మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే మిల్లర్లు ఇచ్చారు. ఇంకా 52 మిల్లులు 78,823 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఇవ్వాల్సి ఉంది.

పక్క జిల్లాల్లో కేసులు

పక్క జిల్లాలో సీఎంఆర్ ఇవ్వని మిల్లర్లను బ్లాక్ లిస్టులో పెట్టడం, వారిపై కేసులు నమోదు చేయడం వంటి చర్యలు చేపట్టారు. అయితే జిల్లాలో మాత్రం ఇంతవరకు ఆ దిశగా చర్యల చేపట్టలేదు. మిల్లర్లు కూడా ఆ విషయాలను పట్టించుకోవడం లేదు. అధికారులు సమీక్షలు చేస్తున్నా వారిలో చీమకుట్టినట్లు కూడా ఉండటం లేదు. వానాకాలం సీఎంఆర్ గడువు ఇంకా మూడు రోజులే ఉన్న నేపథ్యంలో ఈసారి సీఎంఆర్ ఇవ్వని మిల్లుపై ఎలాంటి చర్యలు చేపతారు..? బ్లాక్ లిస్టులో పెడతారా.. లేదంటే కేసులు పెడతారా అన్నది తేలాల్సి ఉంది.

“ ధాన్యం నిల్వపై తనిఖీలు చేస్తున్నాం

పెండింగ్ ఎక్కువ ఉన్న చోట నిరంతరం మిల్లింగ్‌ను తనిఖీ చేసేందుకు డీటీలను నియమించాం. ఎఫ్‌సీఐ, సివిల్ సప్లయిస్ గోదాములను అదనంగా ఏర్పాటు చేశాం. సూర్యాపేటలాంటి చోట ధాన్యమే లేని మిల్లులపై కేసులు పెట్టారు. మన దగ్గర మిల్లుల్లో ధాన్యం ఉందా లేదా అనే విషయంపై ప్రతి 15 రోజులకోసారి పౌర సరఫరాల శాఖ డీటీలతో తనిఖీలు చేయిస్తున్నాం. నెలరోజులకోసారి తహసీల్దార్ బృందాలతో తనిఖీలు చేస్తున్నాం. సీఎంఆర్‌పై ప్రతి బుధవారం సమీక్ష నిర్వహించి వేగవంతం చేస్తున్నాం.

– వెంకటేశ్వర్లు, డీఎస్ఓ

పంచాయతీలకు రూ.9.89 కోట్లు

- 844 పంచాయతీలకు జనాభా ఆధారంగా కేటాయింపు
- కార్మికుల వేతనాలు, ఈఎంఐలు, విద్యుత్ బిల్లు, ఇతర పనుల కోసం..
- ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న గ్రామాలకు ఊరట



నల్లగొండ : పంచాయతీలకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో తొమ్మిది నెలలుగా పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. అయితే గ్రామాల్లో పారిశుద్ధ్యం, వీధి లైట్లు, మోటార్లు, పైపు లైన్ల మరమ్మతుతో పాటు ఇతర ఏ సమస్యలు ఉత్పన్నమైనా పంచాయతీ కార్యదర్శులే సొంతంగా డబ్బులు ఖర్చు చేస్తున్నారు. ఇలా ఒక్కో పంచాయతీ కార్యదర్శి సొంతంగా రూ.50 వేల నుంచి రూ.3 లక్షలకుపైనే ఖర్చు చేశారు. ఈ పరిస్థితిలో ప్రభుత్వం పంచాయతీలకు మూడు రకాల గ్రాంట్లను విడుదల చేయడంతో కాస్త ఊరట లభించినట్లయింది. దసరా సమీపిస్తుండటంతో ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంలో మల్టీ పర్పస్ వర్కర్లలో ఆనందం నెలకొంది.

9 నెలల్లో ఒక్కసారి..

జిల్లాలో 844 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కొత్తగా మరో 24 పంచాయతీలు ఏర్పడ్డాయి. అయితే పాత పంచాయతీలకు సంబంధించి నిధుల లేమితో చాలాచోట్ల మల్టీపర్పస్ వర్కర్ల వేతనాలు, ట్రాక్టర్ల ఈఎంఐలు కూడా బకాయి ఉన్నాయి. ప్రత్యేకాధికారుల పాలన సాగుతున్న ఈ 9 నెలల్లో ఒక్కసారి మాత్రమే నిధులు వచ్చాయి. ఆ నిధులను గతంలో సర్పంచ్‌లు వారు చేసిన పనులకు సంబంధించిన బిల్లులు తీసుకున్నారు. దీంతో పంచాయతీ కార్యదర్శులు అప్పులు తెచ్చి గ్రామంలో పనులకు పెట్టుబడులు పెడుతున్నారు. కేంద్రం ఆర్థిక సంఘం నిధులు ఆగిపోయాయి. పాలకవర్గాలు కొలువుదీరితేనే ఆర్థిక సంఘం నిధులు ఇస్తామని కేంద్రం సంకేతాలు ఇచ్చింది.

వచ్చిన నిధులు ఇలా..

రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ఈఎంఐలు, సీసీచార్జిలు, స్వచ్ఛదనం, పచ్చదనం కోసం రూ.9,89,90,012 ఇచ్చింది. ఇందులో ఈఎంఐలకు రూ.24,35,027, విద్యుత్ బిల్లులకు 2 కోట్ల 26 లక్షల 57 వేల రూపాయలు, స్వచ్ఛదనం కార్యక్రమం కింద 3 వేల జనాభా కంటే తక్కువ ఉన్న గ్రామాలకు రూ.50 వేలు, అంతకంటే ఎక్కువ జనాభా ఉంటే రూ.75 వేల చొప్పున రూ.45 లక్షలు ఇవ్వనుంది. 8 వేల జనాభా కంటే ఎక్కువ ఉంటే లక్ష రూపాయల చొప్పున రూ.3,99,076 విడుదల చేసింది. మల్టీపర్పస్ వర్కర్ల వేతనాలకు రూ. 2,99,98,909 కేటాయించింది.

విద్యుత్ శాఖలో బదిలీలు

- అటెండర్ నుంచి డీఈ వరకు.. ఉన్న ఉద్యోగుల్లో 50 శాతం వరకు..
- నేడు బదిలీల జాబితా ప్రదర్శన
- అక్టోబర్ 7 నాటికి ప్రక్రియ పూర్తి



నల్లగొండ : విద్యుత్ శాఖలో ఉద్యోగుల బదిలీల షెడ్యూల్ విడుదలైంది. అటెండర్ మొదలుకుని డీఈ స్థాయి అధికారుల వరకు ఉన్న ఉద్యోగుల్లో 50 శాతం మందిని బదిలీలు చేయాలని విద్యుత్‌శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. 30 జూన్ 2024 నాటికి రెండు సంవత్సరాలు పూర్తయిన ఉద్యోగులు బదిలీకి అర్హులని పేర్కొంది. బదిలీలన్నింటిని అక్టోబర్ 7వ తేదీనాటికి పూర్తి చేసి 8వ తేదీ నుంచి బదిలీలపై నిషేధం పెట్టనుంది. బదిలీలకు సంబంధించి ఏఏఓ నుంచి డీఈ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. కిందిస్థాయి వారు ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

రెండేళ్లు పూర్తయిన వారు అర్హులు..

ఆ శాఖలో ఉన్న ఉద్యోగుల్లో 50 శాతం మందిని మాత్రమే బదిలీలు చేయనున్నారు. బదిలీలకు ఎక్కువ మంది ఆప్షన్లు ఇచ్చుకుంటే.. తప్పనిసరి బదిలీలు అయ్యేవారిని పరిగణనలోకి తీసుకుని 50 శాతం వరకు బదిలీ చేస్తారు. తక్కువగా ఉంటే రెండేళ్లు పూర్తయిన వారి సీనియారిటీని పరిగణనలోకి తీసుకుని బదిలీ చేయనున్నారు. 2025 సెప్టెంబరు 30వ తేదీలోపు రిటైర్డ్ అయ్యే ఉద్యోగులకు బదిలీలు ఉండవు. వారంతా పనిచేసే చోటనే ఉండేందుకు అవకాశం కల్పించింది.

30వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణ

అటెండర్ మొదలుకుని డీఈ వరకు ఉన్న ఉద్యోగుల్లో రెండేళ్లు పూర్తయి బదిలీలకు అర్హత పొందిన వారి జాబితాను ఎస్ఈ కార్యాలయంలో శనివారం ప్రదర్శిస్తారు. ఆ జాబితాపై ఎలాంటి అభ్యంతరాలున్నా ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా సమర్పించాల్సి ఉంటుంది. బదిలీలకు సంబంధించి ఉద్యోగులు అక్టోబర్ 2వ తేదీ నుంచి 4వ తేదీ వరకు ఆప్షన్లు ఇచ్చుకోవాల్సి ఉంటుంది. అక్టోబర్ 7వ తేదీ వరకు బదిలీలన్నీ పూర్తి చేసి 7వ తేదీన ఉత్తర్వులు ఇవ్వనున్నారు. బదిలీ అయిన ఉద్యోగులంతా 10వ తేదీలోగా విధుల్లో చేరాల్సి ఉంటుంది.

ఆయా స్థాయిల్లో బదిలీల ఉత్తర్వులు

అక్టోబర్ 7న బదిలీల ప్రక్రియ పూర్తవుతుంది. బదిలీ అయిన ఉద్యోగులకు ఏఏఓ నుంచి ఎస్‌జేఓ వరకు, ఏడీ నుంచి డీఈ వరకు కార్పొరేట్ కార్యాలయం నుంచి బదిలీల ఉత్తర్వులు రానున్నాయి. ఏఈ, సబ్ ఇంజనీరుతో పాటు జేఏఓ వరకు, అటెండర్ నుంచి జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్ల వరకు నల్లగొండ ఆపరేషన్ ఎస్ఈ బదిలీల ఉత్తర్వులు ఇస్తారు. లైన్‌మెన్ నుంచి లైన్ ఇన్‌స్పెక్టర్ల వరకు బదిలీల ఉత్తర్వులను డీఈ స్థాయిలో ఇవ్వనున్నారు.

సాగునీరు అందించడమే లక్ష్యం



పులిపలుపులలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

● మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు: బి.వెల్లెంల ఉదయ సముద్రం, చర్లగూడెం, కిష్టారాంపల్లి ప్రాజెక్టులు పూర్తిచేయించి త్వరలో మునుగోడుకు సాగునీరు అందించడమే తన ప్రధాన లక్ష్యమని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మునుగోడు మండలంలోని పులిపలుపుల, సింగారం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్టు దుకాణాలను పూర్తిస్థాయిలో మూసివేయించిన గ్రామాలకు అత్యధిక నిధులు మంజూరు చేయిస్తానన్నారు. పులిపులపుల యూపీ ఎస్‌ను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయించి తన తల్లి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ద్వారా రూ.10 లక్షలు ఖర్చుచేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. అనంతరం స్థానిక క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ పంచాయతీ మంచినీటి సరఫరా సిబ్బంది శిక్షణ శిబిరానికి హాజరై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, వివిధశాఖల అధికారులు వెంకటేశ్వర్లు, ఒబీబ్‌హుద్దీన్, నరేష్, విజయప్రసాద్, స్వరూపరాణి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సైదులు పాల్గొన్నారు.

కాలినడకన కలియదిరిగి..

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆయా గ్రామాల్లో శుక్రవారం దాదాపు నాలుగు గంటల పాటు కాలినడకన కలియదిరిగారు. సింగారంలో ఆయనకు ముగ్గురు దివ్యాంగులు ఎదురుపడ్డారు. ఒక బాలుడికి నరాల బలహీనత ఉందని తెలుసుకుని అతడికి హైదరాబాద్ నిమ్స్‌లో వైద్యం చేయించడంతోపాటు రవాణా చార్జీలు, మందుల ఖర్చులు తానే భరిస్తానని హామీ ఇచ్చారు. మానసిక వికలాంగుల కోసం మునుగోడులో ఓ ప్రత్యేక ఆశ్రమం ఏర్పాటుచేయించి ఉచితంగా వైద్య సేవలతోపాటు వసతి సౌకర్యాలు కల్పిస్తానన్నారు.

నేత్రపర్వంగా ఊంజల్ సేవోత్సవం



అమ్మవారికి ఊంజల్ సేవ నిర్వహించి హారతినిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో శుక్రవారం ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించి ఆలయ తిరు, మాడ వీధుల్లో ఊరేగించారు. అనంతరం అద్దాల మండపంలో అమ్మవారి సేవను అధిష్టింపజేసి ఊంజల్ సేవోత్సవం నిర్వహించారు. ఆండాళ్‌దేవికి ఇష్టమైన నాద స్వరం వినిపించారు.



స్థానిక మొబైల్‌షాపు నిర్వాహకుల నిరసన (ఫైల్)

లోకల్ వర్సెస్ నాన్ లోకల్

నల్లగొండలో మొబైల్ షాపు యజమానుల మధ్య వివాదం

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ జిల్లా కేంద్రంలో మొబైల్ షాపుల మధ్య లోకల్ వర్సెస్ నాక్ లోకల్ వివాదం నడుస్తోంది. దీంతో పట్టణంలో నాలుగు రోజులుగా మొబైల్ దుకాణాలు మూతపడ్డాయి. వివరాల ప్రకారం.. పట్టణంలోని రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన హోల్‌సేల్ దుకాణాల వారు కస్టమర్లకు నేరుగా మొబైల్ స్పేర్ పార్ట్స్ విక్రయిస్తున్నారని.. దీన వల్ల స్థానిక మొబైల్ షాపులు నడవడం లేదని స్థానిక మొబైల్ షాపుల యజమానులు అంటున్నారు. వాస్తవానికి రాజస్థాన్‌కు చెందిన షాపుల వారు స్థానికంగా ఉన్న షాపులకు దుకాణాలకు హోల్‌సేల్ రేట్లకు స్పేర్ పార్ట్స్ సరఫరా చేస్తుంటారు. స్థానిక దుకాణాదారులు వారి వద్ద స్పేర్‌పార్ట్స్ తీసుకుని.. మొబైల్ మరమ్మతు చేస్తూ లాభాలు పొందుతున్నారు.

పట్టణంలో 200లకు పైగా మొబైల్ షాపులు

పట్టణంలో 200లకు పైగా మొబైల్ షాపులు ఉన్నాయి. రాజస్థాన్‌కు చెందిన హోల్‌సేల్ షాపులు 8 వరకు ఉన్నాయి. కస్టమర్లు నేరుగా రాజస్థాన్‌కు చెందిన హోల్‌సేల్ షాపులకు వెళ్లి స్పేర్‌పార్ట్స్ కొనుగోలు చేయడంతో పాటు మరమ్మతు కూడా అక్కడే చేయించుకుంటున్నారు. దీంతో స్థానికులకు షాపులకు గిరాకీలు లేదు. దీంతో స్థానిక షాపుల యజమానులు అంతా కలిసి రాజస్థాన్ షాపుల్లో కస్టమర్లకు అమ్మకాలను నిలిపివేయాలని కోరుతున్నారు.

నాలుగు రోజుల క్రితం సమావేశం..

ఈ వివాదంపై నాలుగు రోజుల క్రితం ఇరువురు సమావేశమయ్యారు. రాజస్థాన్ హోల్‌సేల్ షాపుల వారు నేరుగా మొబైల్ షాపులకు మాత్రమే స్పేర్ పార్ట్స్ అమ్మాలని స్థానిక షాపు నిర్వాహకులు డిమాండ్ చేశారు.



సాగర్ ఎడమకాల్వపై వేములపల్లి మండలం మండలం సల్కునూరు ఎల్-18, 19 సమీపంలో కోతకుగురైన కాల్వ కట్ట



సాగర్ 68వ కిలోమీటరు వద్ద ఎడమకాల్వ కాట్టపై ఏర్పడిన భారీ గుంత

ఎడమకాల్వకు గండి ముప్పు

వేములపల్లి : సాగర్ ఎడమకాల్వకు గండి ప్రమాదం పొంచి ఉంది. కాల్వకు ఇరువైపులా గండి పడే అవకాశం ఉండడంతో రైతులు ఆందోళనలో ఉన్నారు. వేములపల్లి మండల పరిధిలోని సాగర్ ఎడమకాల్వ ఎల్–18, 19 ఎత్తిపోతల పరిధిలోని కాల్వ కట్ట రెండు చోట్ల కోతకు గురైంది. సాగర్ 68వ కిలోమీటరు వద్ద పెద్ద బుంగ ఏర్పడింది. దానికి వంద మీటర్ల దూరంలో కట్ట భారీగా కోతకు గురైంది. ఎడమ కాల్వపై సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం కాగితరామచంద్రాపురం వద్ద గండి పూడ్చివేడంతో కాల్వకు నీటి విడుదలను పెంచారు. దీంతో పాటు వర్షాలు కూడా కురుస్తున్నాయి. భారీ వర్షం కురిస్తే కట్ట మరింత కోతకు గురై గండి పడే ప్రమాదం పొంచి ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే కట్టకు మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి


నాగరాజు (ఫైల్)


ఆంజనేయులు (ఫైల్)

మునుగోడు: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. ఈ ఘటనలు మునుగోడు, మునగాల మండలాల్లో శుక్రవారం చోటుచేసుకున్నాయి. మునుగోడు పట్టణానికి చెందిన రేవెల్లి నాగరాజు(19) తన బైక్‌పై చొల్లేడు గ్రామం నుంచి మునుగోడుకు వస్తున్నాడు. అదేవిధంగా మర్రిగూడ మండలం నర్సిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన కీలకత్తుల ఆంజనేయులు(23) మరో వ్యక్తితో కలిసి బైక్‌పై నల్లగొండ నుంచి మర్రిగూడకు వెళ్తున్నాడు. మునుగోడు గ్రామ శివారులో మూలమలుపు వద్ద అతి వేగంగా వచ్చి ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ఆంజనేయులు బైక్‌పై వెనుక కూర్చున మరో వ్యక్తి రోడ్డు పక్కనే ఉన్న పత్తి చేనులో ఎగిరిపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించినా చుట్టుపక్కలవారు 108 సాయంతో చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

డివైడర్‌ను ఢీకొని..


రాంబాబు మృతదేహం

మునగాల: మునగాల మండలంలోని మాధవరంలో 65వ నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందగా మరో ముగ్గరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానిక ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరుకు చెందిన రాజారపు రాంబాబు(57) తన భార్య రమణ, కుమారుడితో కలిసి దీపావళి పండుగకు అవసరమయ్యే మట్టి ప్రమిదలను కొనుగోలు చేసేందుకు హైదరాబాద్‌కు వెళ్లారు. ప్రమిదలు కొనుగోలు చేసి మినీ గూడ్స్ వాహనంలో గుంటూరుకు బయలుదేరారు. మార్గమధ్యంలో మాధవరం వద్ద వీరి వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ రాంబాబును ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందాడు. వాహనానికి చెందిన ఇద్దరు డ్రైవర్లు జె.రోషిబాబు, గోనె క్రాంతికుమార్‌తో పాటు మృతుడి భార్య రమణకు స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు లోకేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహానికి కోదాడ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నదిలో దూకి వృద్ధుడి ఆత్మహత్యాయత్నం

- కాపాడిన సాగర్ పోలీసులు


వృద్ధుడిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న సాగర్ ఎస్‌ఐ సంపత్

నాగార్జునసాగర్: వంతెన పైనుంచి నదిలో దూకి ఆత్మహత్యాయత్నం చేసిన వృద్ధుడిని సాగర్ పోలీసులు కాపాడారు. ఎస్‌ఐ సంపత్ తెలిపిన వివరాల ప్రకారం.. హాలియాలోని శాంతినగర్‌కు చెందిన దొడ్డి పాండయ్య మతిస్థిమితం లేక శుక్రవారం కొత్త వంతెనపై తచ్చాడుతూ తిరుగుతున్నాడు. కృష్ణానదిలోకి దూకేందుకు ప్రయత్నిస్తుండడంతో అక్కడ ఉన్న పర్యాటకులు, పండ్ల జ్యూస్ వ్యాపారులు పోలీసులకు సమచారమిచ్చారు. ఎస్‌ఐ తన సిబ్బందితో అక్కడికి చేరుకుని వృద్ధుడిని కాపాడి పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. వివరాలు తెలుసుకుని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

యువకుడు అదృశ్యం

చౌటుప్పల్: చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని బ్యాంకులో నగదు డ్రా చేసేందుకు వెళ్లిన యువకుడు అదృశ్యమయ్యాడు. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామానికి చెందిన ఎండీ సమీర్(20) గురువారం ఉదయం పట్టణ కేంద్రంలోని స్టేట్ బ్యాంకులో నగదు డ్రా చేసేందుకు ఇంటి నుంచి వెళ్లాడు. ఆ తర్వాత ఫోన్ స్విచ్‌ఆఫ్‌లో ఉంది. స్థానికంగా, బంధువులను వాకబు చేసినా ఆచూకీ లభించలేదు. దీంతో అతని తండ్రి యూసూఫ్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఎల్లగిరిలో..


నర్సింహ

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలం ఎల్లగిరి గ్రామానికి చెందిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. గ్రామానికి చెందిన జెర్రిపోతుల నర్సింహ(52) కూలీ పనికి వెళ్లేవాడు. మానసిక వికలాంగుడు కావడంతో పలు మార్లు ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి వచ్చేవాడు. ఈ నెల 17న ఇంటిని వెళ్లిపోయిన అతను ఇంటికి తిరిగి రాలేదు.అతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

విద్యుత్ వైరు చోరీ చేసిన ఇద్దరి అరెస్ట్


పట్టుబడిన నిందితులను చూపుతున్న ఎస్‌ఐ అనిల్‌రెడ్డి

కోదాడరూరల్: విద్యుత్ వైర్‌ను చోరీ చేసిన ఇద్దరు వ్యక్తులను రూరల్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల కోదాడ మండలంలోని వచ్చిన భారీ వర్షాలు, వరదలకు తొగర్రాయి సబ్‌స్టేషన్ పరిధిలో వందల సంఖ్యలో విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. వాటి స్థానంలో నూతన స్తంభాలు అమర్చి ఏఏఏ కండక్టర్ వైర్, ఏబీ కేబుల్ విద్యుత్‌తీగను లాగారు. మిగిలిన వైర్‌ను సబ్‌స్టేషన్‌లో భద్రపరిచారు. గమనించిన గరిడేపల్లి మండలం వెలిదండకు చెందిన దాసరి వంశీ, తొగర్రాయికి చెందిన నామాల వీరబాబు ఈ నెల 16న వైర్‌ను చోరీ చేశారు. అయితే దానిని వెంటనే విక్రయించకుండా తొగర్రాయిలోని వీరబాబు ఇంట్లో దాచిపెట్టారు. ఈ సంఘటనపై కోదాడ ఏడీఈ వెంకన్న రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. శుక్రవారం విజయవాడలో విక్రయించేందుకు ఆటోలో వెళ్తుండగా రాష్ట్ర సరిహద్దు రామాపురం క్రాస్‌రోడ్‌లో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుబడినట్లు ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. వారిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వైరు విలువ సుమారు రూ.1.10లక్షలు ఉంటుందని పేర్కొన్నారు.

పాముకాటుతో రైతు మృతి

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట): పాముకాటుతో రైతు మృతిచెందిన సంఘటన ఆత్మకూర్ మండల పరిధిలోని పాతర్లపహాడ్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గుంటూరు వెంకటయ్య (58) పాము కాటువేసింది. చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య లలితమ్మ, ఇద్దరు కుమారులు, కూమార్తె ఉన్నారు. కుమారుడు సుదర్శన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సైదులుగౌడ్ తెలిపారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నకిరేకల్: నకరేకల్‌లోని వీటీ కాలనీలో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వీటీ కాలనీలో నివాసం ఉంటున్న నాగోజు నాగాచారికి (35) అతడి భార్యకు తరచూ గొడవ జరిగేది. దీంతో మనస్తాపానికి గురైన నాగాచారి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడు తండ్రి యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లచ్చిరెడ్డి తెలిపారు.

మానసిక దివ్యాంగురాలిపై లైంగికదాడి

- కామేపల్లిలో ఆలస్యంగా వెలుగులోకి

మిర్యాలగూడ: వేములపల్లి మండలంలోని కామేపల్లి గ్రామంలో మానసిక దివ్యాంగురాలిపై ఓ వ్యక్తి లైంగికదాడికి పాల్పడిన ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. కామేపల్లి గ్రామానికి చెందిన 21 సంవత్సరాల మానసిక, శారీరక దివ్యాంగురాలి తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్తుండగా ఆమె ఇంటి వద్దే ఉంటోంది. ఈక్రమంలో అదే గ్రామానికి చెందిన మోటం రాకేష్ గత మూడు నెలలుగా ఆమెను బెదిరించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీంతో ఆమె గర్భం దాల్చింది. తన కుమార్తె సైగలతో చెప్పిన విషయాన్ని గుర్తించిన తల్లిదండ్రులు ఈనెల 20న రాకేష్‌తోపాటు అతని తండ్రి దస్తగిరిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. చికిత్స చేయించేందుకు రాకేష్, అతని తండ్రి దస్తగిరి, బాబాయి బాబుగిరి తమ కుమార్తెను ఇంటికి తీసుకెళ్లారని, ఈ విషయంపై వారిని నిలదీయగా తమను బూతులు తిట్టారని, ఎవరికైనా చెప్తే చంపుతామని బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై మిర్యాలగూడ రూరల్ సీఐ వీరబాబును వివరణ కోరగా పిటిషన్ రాగానే కేసు నమోదు చేశామని, పూర్తిస్థాయిలో విచారించి బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

గుండ్లపల్లి సుధాకర్‌కు డాక్టరేట్

నల్లగొండ: నల్లగొండలోని భారత్ భవిత హైస్కూల్‌లో బయాలజీ టీచర్‌గా పనిచేస్తున్న గుండ్లపల్లి సుధాకర్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి బయాలజీ విభాగంలో డాక్టరేట్ పట్టా పొందారు. ఈసందర్భంగా శుక్రవారం పాఠశాల కరస్పాండెంట్ మోదుగు సత్తిరెడ్డి ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మోదుగు జ్యోతి, ఉపాధ్యాయులు నాగయ్య, నాగేందర్, శ్రీనివాస్, బెంజిమెన్, మౌలానా, పార్థు తదితరులు పాల్గొన్నారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

త్రిపురారం : మండల కేంద్రానికి చెందిన వేమవరపు సత్యసాయి(25) మేదరి శైలజ(30) నిడమనూరు మండల పరిధిలోని బొక్కమంతల పాడు వద్ద బట్టలు ఉతకడానికి వెళ్లి బుధవారం ప్రమాదవశాత్తు కాలువలో పడి గల్లంతయ్యారు. త్రిపురారం మండలంలోని కంపాసాగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కాలువలో గురువారం మేదరి శైలజ మృతదేహం లభ్యం కాగా, శుక్రవారం అదే ప్రాంతంలో సత్యసాయి మృతదేహాన్ని నిడమనూరు పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

దత్తప్పగూడెంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ దాడులు


సీజ్ చేసిన మందులు

మోత్కూరు: మోత్కూరు మండలంలోని దత్తప్పగూడెం గ్రామంలో యాదాద్రి భువనగిరి జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అశ్వినికుమార్ శుక్రవారం తనిఖీ చేసి అక్రమంగా నిల్వ ఉంచిన మెడిసిన్‌ను పట్టుకున్నారు. పోలెబోయిన భిక్షపతికి చెందిన లైసెన్స్ లేనటువంటి ప్రాంగణంలో నిల్వ చేసిన 26 రకాల మందులను సీజ్ చేశారు. వీటి విలువ సుమారు రూ.30 వేలు ఉంటుందని తెలిపారు. డ్రగ్ యాక్ట్ 1940 ప్రకారం భిక్షపతిపై కేసు నమోదు చేసి రామన్నపేట జడ్జి ముందు హాజరు పరిచినట్లు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

15 లీటర్ల సారా స్వాధీనం


ఎక్సైజ్ అధికారులకు పట్టుబడ్డ మహిళ

హుజూర్‌నగర్: ఎక్సైజ్ అధికారుల తనిఖీల్లో 15 లీటర్ల సారా, 2 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈసంఘటన హుజూర్‌నగర్ నియోజకవర్గంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మఠంపల్లి మండలం కొత్తతండాకు చెందిన బాణోతు లక్ష్య, బానోతు శైలజ బైక్‌పై 7 లీటర్ల సారా తరలిస్తుండగా మీగడంపాడు వద్ద ఎక్సైజ్ అధికారులు తనిఖీ పట్టుకున్నారు. ఈమేరకు వారిపై కేసు నమోదు చేశారు. అదేవిధంగా పాలకవీడు మండలం కల్మెట్‌తండాకు చెందిన రూపవత్ బద్య తన ద్విచక్ర వాహనంపై 8 లీటర్ల సారా తరలిస్తుండగా కల్మెట్ తండా శివారులో తనిఖీ చేసి సారా పట్టుకుని, వాహనం సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. తనిఖీల్లో ఎస్‌ఐ వెన్నెల, సిబ్బంది నాగయ్య, నాగరాజు, రవి కుమార్, బాలు తదితరులున్నారు.

పోగొట్టుకున్న సొమ్ము అప్పగింత

నల్లగొండ క్రైం: నల్లగొండ పట్టణంలోని ప్రకాశం బజార్‌లో శుక్రవారం సావర్కర్‌నగర్‌కు చెందిన పద్మావతి బ్యాగ్ రోడ్డుపై పడిపోయింది. గమనించిన కంటి అద్దాల షాపు యజమాని యాదగిరి వెంటనే వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించాడు. బ్యాగులో 4 తులాల బంగారు ఆభరణాలు, రూ.10 వేల నగదు ఉంది. సీఐ రాజశేఖర్ రెడ్డి సీసీ కెమెరాల ద్వారా బాధితురాలిని గుర్తించి బ్యాగును, నగదును అందజేశారు. నిజాయతీగా వ్యవహరించిన యాదగిరిని సీఐ అభినందించారు.

టాటా ఏస్ వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

తిరుమలగిరి : టాటాఏస్ వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో ఓ వ్యక్తి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని తొండ గ్రామం వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్‌కు చెందిన తరుణ్‌కుమార్ తన ద్విచక్ర వాహనంపై చౌటుప్పల్ వెళ్తుండగా తొండ గ్రామ శివారులోకి రాగానే వెనుక నుంచి టాటాఏస్ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడి కుడి కాలు విరిగింది. సమాచారం అందుకున్న 108కొడకండ్ల అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స అందజేసి వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు.

పేలుడు పదార్థాలు సీజ్

మఠంపల్లి: మండలంలోని రఘునాథపాలెం గ్రామం సమీపంలోని క్వారీల్లో గనుల తవ్వకానికి కొంతమంది పేలుడు పదార్థాలతో బ్లాస్టింగ్‌కు పాల్పడుతున్నారు. దీంతో ఇళ్లకు ప్రమాదం సంభవిస్తుందని గుండ్లపల్లి, రఘునాథపాలెం గ్రామస్తుల నుంచి ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో శుక్రవారం మఠంపల్లి పోలీసులు, స్పెషల్ బ్రాంచ్ పోలీసులు స్థానికంగా దాడులు నిర్వహించారు. ఈమేరకు సుమారు 55 జిలటిన్ స్టిక్స్, 4 డిటోనేటర్లు లభ్యమైనట్లు తెలిసింది.

జూదరుల అరెస్టు

నూతనకల్: మండల పరిధిలోని ఎర్రపహాడ్ గ్రామ శివారులో శుక్రవారం పేకాట ఆడుతున్న వారిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ మహేంద్రనాథ్ తెలిపారు. గ్రామానికి చెందిన గుండా సత్యనారాయణ వ్యవసాయ భూమిలో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసు సిబ్బందితో దాడులు నిర్వహించినట్లు చెప్పారు. ఈమేరకు గుండా సత్యనారాయణ, గాద్దుల అవిలయ్య, మునిగడప కృష్ణమాచారి, సూరారపు అంజయ్య, మహేష్‌లను పట్టుకొని వారి వద్ద నుంచి రూ.6వేల 250 నగదు, మూడు బైక్‌లతో పాటు పేక ముక్కలను స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పాతచాకిరాలలో ఆరుగురిపై కేసు

నడిగూడెం: మండల పరిధిలోని పాతచాకిరాలలో ఖాళీ స్థలంలో పేకాట స్థావరంపై పోలీసులు శుక్రవారం దాడులు చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురిపై కేసు నమోదు చేసి, వారి నుంచి రూ.2050 నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ అజయ్ కుమార్ తెలిపారు.

ఇసుక డంప్‌ల పరిశీలన


అనంతారంలో ఇసుక డంప్‌లను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

తిరుమలగిరి : తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని అనంతారం గ్రామంలో సీజ్ చేసిన ఇసుక డంప్‌లను శుక్రవారం రెవెన్యూ అధికారులు పరిశీలించారు. గతంలో సి5 కంపెనీ వారు అక్రమంగా నిల్వచేసిన ఇసుకను గతంలో రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. సీజ్ చేసిన ఇసుకను అక్రమార్కులు దొంగతనంగా ట్రాక్టర్లు, టిప్పర్లతో తరలించారు. దీనిపై సాక్షి దినపత్రికలో సీజ్ చేసిన ఇసుక మాయం అనే కథనం శుక్రవారం ప్రచురితం కావడంతో రెవెన్యూ అధికారుల ఇసుక డంప్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ జాన్ మహ్మద్ మాట్లాడుతూ.. ఇసుక తరలింపుపై పూర్తి విచారణ జరుపుతామని, జిల్లా అధికారులకు నివేదిక పంపుతామని తెలిపారు. ఆయన వెంట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మగ్దుమ్‌బాబా ఉన్నారు.

రూ.51 కొట్టు.. మేకను పట్టు..!

- గ్రామాల్లో పోటాపోటీగా దసరా ఆఫర్లు
- ఆరాతీస్తున్న పోలీసులు



సోషల్‌మీడియాలో వైరల్ అయిన ఫ్లెక్సీ

చిట్యాల, మర్రిగూడ: దసరా పండగ సమీపిస్తుండటంతో గ్రామాల్లో సందడి నెలకొంటోంది. చిట్యాల, మర్రిగూడ తదితర మండలాల్లో దసరా పండుగ సందర్భంగా యువకులు సరికొత్త స్కీం ప్రారంభించారు. చిట్యాల మండలంలోని వెలిమినేడు గ్రామంలో కొందరు యువకులు «51 రూపాయలు కొట్టు.. మేకను పట్టు» అని ప్రచారం చేస్తున్నారు. ఈ స్కీంలో 51 రూపాయలు చెల్లించి కూపన్ తీసుకుంటే.. కూపన్‌ల నుంచి డ్రా తీస్తారు. మొదటి బహుమతిగా పన్నెండు కిలోల మేక, రెండో బహుమతిగా రెండు లిక్కర్ బాటిళ్లు, మూడో బహుమతిగా మరో రెండు లిక్కర్ బాటిళ్లు, నాలుగో బహుమతిగా రెండు కడక్‌నాథ్ నాటు కోళ్లు, ఐదో బహుమతిగా కాటన్ బీర్లు ఇచ్చేట్లు సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేస్తున్నారు.

ఇక్కడ వంద రూపాయల స్కీం

మర్రిగూడ మండలంలోని లెంకలపల్లి గ్రామంలో మరో తీరుగా ఆఫర్లు ప్రకటిస్తున్నారు. వంద రూపాయలు చెల్లించి కూపన్ తీసుకున్న వారిలో నుంచి డ్రా తీసి మొదటి బహుమతి 10కిలోల మేక, రెండవ బహుమతి రెండు మద్యం బాటిళ్లు(బ్లెండర్ స్ప్రైడ్), మూడవ బహుమతి కాటన్ బీర్లు, నాలుగవ బహుమతి రెండు నాటు కోళ్లు, ఐదవ బహుమతి ఒక మద్యం బాటిల్ అందించనున్నామని, వచ్చే నెల 10న గ్రామంలో డ్రా తీయనున్నట్లు నిర్వాహకులు బ్యానర్ ఏర్పాటు చేశారు. కాగా, ఈ ప్రచారాలపై పోలీసులు ఆరాతీస్తున్నారు.


గ్యాస్ సిలిండర్‌లో నీరు

తుంగతుర్తి : గ్యాస్ ఏజెన్సీలు సిలిండర్లలో గ్యాస్ బదులుగా నీరు ఉన్న సిలిండర్‌ను సరఫరా చేయడంతో వినియోగదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. మండల పరిధిలోని కర్విరాలకొత్తగూడెంలో నారాయణ గత నెలలో గ్యాస్ ఏజెన్సీ దగ్గర సిలిండర్‌ను కొనుగోలు చేశాడు. శుక్రవారం తన ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్ ఖాళీ కావడంతో గత నెలలో కొనుగోలు చేసిన సిలిండర్‌ను వినియోగించడానికి ప్రయత్నించాడు. కానీ ఎంతకు గ్యాస్ స్టౌవ్ వెలగకపోవడంతో సిలిండర్‌ను బయటకు తెచ్చి ఊపి చూశాడు. సిలిండర్‌లో నీరు ఉన్నట్లు గుర్తించాడు.

'ప్లాంటిక్స్'తో సాగు సమస్యలకు చెక్

- యాప్‌లో రైతులకు సమగ్ర సమాచారం
- అందుబాటులో 350 రకాల తెగుళ్లకు నివారణ చర్యలు

పెద్దవూర: వ్యవసాయంలో వస్తున్న నూతన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం రైతులకు లాభసాటిగా మారుతోంది. రైతులకు వ్యవసాయానికి సంబంధించిన సమగ్ర సమాచారం జర్మనీలోని పీట్ (ప్రోగ్రెసివ్ అగ్రికల్చర్ అండ్ ఎన్విరాన్‌మెంట్ టెక్నాలజీ) శాస్త్రవేత్తలు రూపొందించిన «ప్లాంటిక్స్» యాప్ ద్వారా అందుతోంది. ప్లాంటిక్స్ యాప్‌ను తెలుగు రైతుల అవసరాలకు అనుగుణంగా ఇక్రిశాట్, ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు రూపొందించారు. తెగుళ్లు, చీడపీడలకు సంబంధించిన సమగ్ర సమాచారం తెలుగులో ఉండటం ఈ యాప్ ప్రత్యేకత. 350 రకాలకు పైగా తెగుళ్లు, వాటికి గల నివారణ చర్యలు శాస్త్రవేత్తలు ఈ ప్లాంటిక్స్ యాప్‌లో నిక్షిప్తం చేశారు.



ప్లాంటిక్స్ యాప్‌లో కనిపించే అంశాలు

డౌన్‌లోడ్ చేసుకునే విధానం..

ప్రతి ఒక్కరూ ఈ యాప్‌ను ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ప్లేస్టోర్‌లోకి వెళ్లి ప్లాంటిక్స్(ప్లాంటిక్స్) అని టైప్ చేయగానే ప్లాంటిక్స్ యువర్ క్రాప్ డాక్టర్ అని వస్తుంది. ఇది డౌన్‌లోడ్ కాగానే ఓపెన్ చేస్తే స్క్రీన్‌పై తెలుగుతో పాటు వివిధ రకాల భాషలు ఉంటాయి. యాప్ ఓపెన్ చేశాక పేరు, ఫోన్ నంబర్ ఎంటర్ చేయాలి. ఫోన్‌కు ఒక కోడ్ వస్తుంది. దీనిని అందులో ఎంటర్ చేస్తే సేవలు అందుబాటులోకి వస్తాయి.



పంటల ఎంపిక ఇలా..

ప్లాంటిక్స్ యాప్‌లో సాగు చేస్తున్న, సాగు చేయాలనుకుంటున్న పంటలను ఎంపిక చేసుకోవచ్చు. తర్వాత ఆ పంటలు ఏ కాలంలో సాగు చేయాలి. ఏ నేలలు అనుకూలమో, పంట విస్తీర్ణం బట్టి ఎరువులు ఏ మోతాదులో వేయాలో యాప్‌లో తెలుసుకోవచ్చు. పంటలకు తెగుళ్లు సోకినా, చీడపీడలు వ్యాపించినా ఏ మందులు పిచికారీ చేయాలో, ఎలా నివారించాలో యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. పంటలను ఆశించిన చీడపీడలను తొలి దశలోనే గుర్తించి రైతులను అప్రమత్తం చేసేందుకు ఈ యాప్ ఎంతో ఉపయోగపడుతుంది.

వాతావరణంలో మార్పులు తెలుసుకోవచ్చు

ఈ యాప్ ద్వారా వాతావరణంలో మార్పులను తెలుసుకునే వీలు ఉంది. దీని కారణంగా పంటను రక్షించుకోవడంతో పాటు వర్షాల బారిన పడకుండా పంట దిగుబడి కాపాడుకోవచ్చు. రానున్న రోజుల్లో వాతావరణంలో ఎలాంటి మార్పులు చోటు చేసుకుంటాయో ఈ యాప్ ద్వారా ముందే తెలుసుకోవచ్చు.

ఫొటో పంపితే సమస్యకు పరిష్కారం

పంటలకు తెగుళ్లు సోకినా, చీడపీడలు ఆశించినా, పంటల్లో అకస్మాత్తుగా మార్పులు సంభవించినా ప్లాంటిక్స్ యాప్ ద్వారా నివారణ చర్యలు తెలుసుకోవచ్చు. పొలం దగ్గరికి వెళ్లాక ప్లాంటిక్స్ యాప్‌లో పంట ఆరోగ్య పరీక్ష అంశంపై క్లిక్ చేసి సమస్య ఉన్న ప్రదేశంలో ఫొటో తీయాలి. తర్వాత ఆ ఫొటోను అప్‌లోడ్ చేయాలి. శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు స్పందించి సమస్య నివారణపై సలహాలు, సూచనలు అందిస్తారు. ఈ యాప్ ద్వారా రైతులు వెంటనే నివారణ చర్యలు చేపట్టవచ్చు.